[illegible]

[illegible]

గాలి ఆగింది. చుట్టూ చూసింది. చీమూరాళ్ళు నరి నురు పొడుచుకుంటు న్నాయి. వీధిదీపాలలో జీవం లేదు. కొద్ది దూరంలో మసక మసకగా కనిపి స్తున్న పొలాలు. ఎదురుగా ఠీవిగా నిలబడి ఆహ్వానిస్తున్న కట్ట. కట్ట ఎక్కుతూన్న సుశీల "అబ్బా" అంటూ ఆగిపోయింది. అరికాలులో గుచ్చుకుపోయిన గాజుపెంకుని లాగి పారేసింది. చేతికి వెచ్చని తడి, 'పాదం కింద పోతే బాధ! గట్టు గతుకుల తోను, రాళ్ళతోను చెలిమి చేసుకుని ఉంది. ఎలాగో గట్టు పైకి చేరింది. గట్టుపైన ఉన్న రైలుపట్టాలు నల్ల త్రాచుల్లా మిలమిలమంటున్నాయి. రెండు లైను లున్నాయి. సుశీల మొదటి లైనుని తన కోసం ఎన్నుకుంది. గట్టు మీదే ఉన్న ఒక రాయి మీద కూలబడింది ఆదుర్దాగా. ఎదురుగా ఖాళీరోడ్డు నిర్లిప్తంగా నోరు తెరుచుకుని ఉంది. కొద్ది దూరంలో మసక మసకగా వెలుగు తూన్న వీధిదీపం జరగబోయే ఘోరం చూడలేనట్లుగా గుప్పున ఆరిపోయింది. దూరంగా ఒక ఊరకుక్క. హృదయ విదారకంగా ఏడుపు అందుకుంది. మంచు కన్నీళ్ళు కారుస్తూంది. తారలు వద్దని వారిస్తున్నట్లు మిణుకు మిణుకు మంటు న్నాయి.

రైలుపట్టాల మీద దూరాన లైటు కనిపించింది. ఉలిక్కిపడింది సుశీల. రైలు వచ్చేస్తూంది. ఇక తన జీవితం నిమిషాల్లో పడింది. మృత్యువు అరుగులు వాస్తూ అతి వేగంగా ముందుకు దూసుకు వస్తూంది. సుశీల దృఢ నిశ్చయంతో లేచి నిలబడింది. ఒకసారి తల్లిదండ్రులని, బాబయ్యని, ఇష్టదైవాన్ని మనసులోనే తలుచుకుంది. నిశ్శబ్దంగా తల పట్టా మీద ఉంచింది. రైలు దగ్గరి కొచ్చే స్తూంది. కాంతివంతమైన వెలుగు ఆమె మీద పడుతూంది. కళ్ళు మూసుకుంది. రైలు హోరు దగ్గరయింది. ఊపిరి బిగబట్టింది. దడదడలాడుతూ కసిగా చూసి వెళ్ళిపోయింది గూడ్సుబండి.

సుశీల తల ఎత్తింది. రైలు చివరి పెట్టె కనిపిస్తూంది. తను సరిగా గమనించలేదు. కొద్ది దూరంలో రైలు పట్టాలు మారింది. మృత్యువుకికూడా



తనంటే పరిహాసంగా ఉంది. దీర్ఘంగా నిట్టూర్చింది సుశీల.

"ఎవరమ్మా నువ్వు? ఇంత రాత్రివేళ ఇక్కడ ఏం చేస్తున్నావు?" నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వచ్చిన మాటలకు ఉలిక్కి పడింది సుశీల.

ఎదురుగా లుంగీ, బనీనులో ఒక ఏభై ఏళ్ళ అస్థిపంజరం లాంటి మనిషి నిలబడి ఉన్నాడు. జుట్టంతా ముగ్గు బుట్టలా ఉంది. "ఒంటరిగా వయసులో ఉన్న పిల్లవి, ఇలాంటి చోట కూర్చోవటం ప్రమాదం కదూ?" సౌమ్యంగా మంద లించా డాయన.

ఆయన్ని చూడగానే సుశీలకి బాబాయి గుర్తుకు వచ్చి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "అబ్బే. . . అబ్బే. . . ఏం లేదండి! ఇంట్లో ఏమీ తోచక. . ." అని మాట ఎలా పూర్తి చెయ్యాలో సుశీలకి తెలియలేదు.

"ఎందుకమ్మా నిజం దాస్తావు? నువ్వు రైలుపట్టామీద తల పెట్టడం నేను చూడలేదనుకున్నావేమిటి?" కళ్ళు ఎగరేస్తూ ఆడిగా డాయన.

సుశీల ఏమీ అనలేక చప్పున తల దించుకుంది.

"నీ కంత కష్టం ఏం వచ్చిందమ్మా! ఇంకా జీవితమంతా ముందే పరుచుకుని ఉంది. అసలు మన్నెందుకీ అఘాయిత్యా నికి పూనుకున్నావు? తండ్రి లాంటి వాడిని, సంశయించక నాతో చెప్పు." లాలింపుగా అన్నా డాయన దగ్గుతూనే.

అరచేతుల్లో మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది సుశీల. ఖరుడు కట్టిన హృదయం కరిగి, కంటిద్వారా వెలువడికి దారి చేసుకుంది. నిశ్శబ్దంగా రోదిస్తున్న

[illegible]

పసితనం కాపాడే వారు లేక, నా కెవ్వరూ ఆధారం లేదు. ఇంక చావు తప్ప నాకు శరణ్యం లేదు. ఎయినా ఈ ఆఖరి ఘడియల్లో నన్ను ఒంటరిగా వదిలి, మీ దారిన మీరు వెళ్ళండి" అని నిశ్చలంగా అంది సుశీల.

ఆ మాటలకు అతను చలించలేదు. చిన్నగా నవ్వి, "చివరి ఘడియల్లో దాపరికం దేనికి? నా కూతురే ఇటువంటి స్థితిలో ఉంటే నా దారిని నను పోగలనా? నువ్వు కారణం చెప్పేదాకా నేను వదలను" అన్నాడు. ఆయన కంఠంలో ఆప్యాయత తొంగిచూస్తూంది. సుశీల హృదయం మరోసారి కదిలి, కరిగింది. ఆయనలో ఆమెకు బాబాయి కనిపిస్తున్నాడు.

"అయితే, వినం, బాబాయ్" అంటూ సుశీల తన గతుకుల గాఢాంధకార జీవితం అంతా ఆయనకు చెప్పి కళ్ళు తుడుచు కుంది.

అంతా విన్నాక ఆయన, "అమ్మాయ్, నా వెంట రా!" అన్నాడు తాపీగా.

"ఎందుకు?"

"నువ్వు నా వెంట మా ఇంటికి రావాలి."

"రాను, రాలేను."

"నువ్వు వచ్చి తీరాలి."

"అక్కడ నన్ను నిర్బంధిస్తే?"

"నా మీద ఆమాత్రం విశ్వాసం లేదా? సరే, ప్రమాణంచేసి చెబుతున్నాను నేను నిన్ను నిర్బంధించను. మళ్ళీ అరగంట లోపల మ ళ్ళిక్కడకు వచ్చేయవచ్చు." దగ్గును అపుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తూ, కట్ట దిగా డాయన. సుశీల మౌనంగా ఆయన్ని అనుసరించింది. ఆయన సుశీలను నాలుగు సందులు తిప్పాడు. సందుల్లో దుర్గంధం ముక్కుల్ని బద్దలుకొడుతూంది. రకరకాల దోమలు పాడుకుంటూ పండగ జరుపుకుంటు న్నాయి. ఇద్దరూ ఒక ఇరుకుసందు చివర ఉన్న చిన్న పెంకుటింటి ముందు ఆగారు.

వెల్సిన తగిలే చూరు. నమ్మాడి పోయిన అరుగు. చిల్లులు పడ్డ తలుపు. వెలిసిపోయిన గోడలు. గూళ్ళలాంటి ఆ ఇంటి తలుపు తోసుకుని లోపలికి నడిచాడు ఆ మనిషి. క్షణం సంశయించి, మళ్ళీ తెగించి తనూ లోపలికి అడుగు పెట్టింది సుశీల. గూట్లో ఉన్న గుడ్డి లాంతరు చీకటితో యథాశక్తి పోరాడు తూంది. ముందు గదిలో నేలమీద



పిల్లల నవల

గీతా సుబ్బారావ్ రచించిన

# బాలమనసులు

వచ్చేవారం ప్రారంభం!

---

వ ఎం పెరుమకుని, కప్పుకోవడాని కేమీ లేక ముడిచిపెట్టుకుని పడుకుని ఉన్నారు ఆ కుటుంబ సభ్యులు.

"ఎక్కంతా నా సంతానం. వీళ్ళ సందరినీ మీకు పరిచయం చేస్తాను" అన్నాడాయన.

సుశీలకి క్షణం ఆయన ఉన్మాదు డేమోనని అనుమానం వచ్చింది.

"వాళ్ళంతా నిద్రపోతున్నారు. ఇప్పుడు వాళ్ళని పరిచయం చేయవలసిన అవసరం ఏమిటి?"

"అదే అవసరం. నే నేమీ వాళ్ళను లేపను. లేపినా వాళ్ళు లేవరు. నువ్వు నిశ్శబ్దంగా నా మాటలు విను" అని 'ఆయన ముందున్నవైపు పడుకున్న పాతి కేళ్ళ మనిషిని చూపిస్తూ, "ఏడు మా పెద్దాడు. ఎనిమిదేళ్ళ క్రితం స్కూలుఫైనలు తప్పాడు. ఉద్యోగం సద్యోగం లేదు. ఇంట్లో ఉన్న వేవో రహస్యంగా అమ్మేసుకోవటం, రోడ్లమ్మట తిరగడం వీడి పని. వేళకి ఎక్కడున్నా భోజనానికి వచ్చేస్తాడు" అని క్షణం ఆగాడు ఆయన.

సుశీల ఇలాంటి వాడుంటాడా అని ఆశ్చర్యపోయింది.

"ఆ పక్కది రెండోది. ఇరవై మూడేళ్ళు దానికి. పోలియో వచ్చింది. నడవలేదు. దానితోపాటు ఇంట్లో వాళ్ళంతా నరకయాతన పడుతున్నారు." నోటికి చేయి అడ్డం పెట్టుకుని దగ్గుతూ అన్నాడాయన.

సుశీలకు జాలివేసింది.

"దాని పక్కది మూడో పిల్ల. అన్నా మామా నా తోటి, వాళ్ళమ్మతోటి దెబ్బలాడటమే దాని పని. ఇంట్లో పని ముట్టుకోదు. ఇరుగింట్లోనూ, పొరుగింట్లోనూ కాలం గడుపుతుంది. దాని పక్కన ఎర్ర చీర అమ్మాయి నాలుగవది పక్కింటి స్టూడెంట్‌ని లవ్వాడి వెంటనే పెళ్ళిచేయమని, లేకపోతే నూతిలో పడి చస్తానని బెదిరించి, అక్కలకు కాక పోయినా తనమాత్రం పెళ్ళి చేసేసుకుంది. దాని పెళ్ళికి మూడు వేలు అప్పయింది. దానిపక్కనున్నవాడు అయిదవ వాడు. అన్నయ్య బాటలోనే నడవబో తున్నాడు. నా చొక్కా జేబులు, పోపు డబ్బాలు అప్పుడప్పుడు తడిమి చూస్తాడు. ఆరో వాడు అర్భకుడు. భయస్థుడు. వారానికి అయిదు రోజులు పడకేస్తూ ఉంటాడు. ఇప్పటికి అయిదు వందల రూపాయలమందులైనా మింగిఉంటాడు. ఏడవ వాడికి బుర్రలేదు. వాడి తల సరిగ్గా ఈ రోజుల్లో ముప్పావలాకి వచ్చే కొబ్బరి కాయంత ఉంటుంది. ఆఖరి వాళ్ళిద్దరూ ఆడపిల్లలు." ఆయన దగ్గుతూనే అంతా చెప్పాడు.

సుశీలకి నరకంలో ఉన్నట్లుగా ఉంది.

ఆ గది వదిలారు—గది నానుకుని చిన్న వసారా. ఆ వసారాకి ఒక పక్క తడికల వంటిల్లు. వెనకాల పారుతున్న పెద్ద మురికికాలువ.

వసారాలో ఒక నులక మంచం ఖాళీగా ఉంది. బహుశా అది ఆయనదే అయి ఉంటుంది. వంటింట్లో ఇద్దరు ఆడ వాళ్ళు గుమ్మంవైపు తల పెట్టుకుని పడుకుని ఉన్నారు.

"ఆ ఎముకల గూడు ఒక యంత్రం. ఇంటి చాకిరీ అంతా అదే చెయ్యాలి. ఆయాసం, గుండెదడ, నీరసం, అజీర్తి దాని చెలికత్తెలు. ఆమె పక్కనున్న ముగ్గుబుట్ట నన్నీ నరకంలో పారేసిన మాతృమూర్తి. కళ్ళు కనబడవు. చాదస్తం. అనుక్షణం అందర్నీ వేధించుకుతింటుంది." ఊపిరి తీసుకోవడా నికన్నట్లు క్షణం ఆగాడాయన.

ఆ ఇంటి వాతావరణం, ఆ ఇంటి మనుషుల్ని చూస్తూ ఉంటే సుశీల బుర్ర వేడెక్కిపోతూంది.

"ఇక నా విషయం. మామూలు గుమాస్తాని. నెలకి రెండు వందల రాళ్ళు వస్తాయి. వాటితో ఈ బండిని ఈడ్చుకు రావాలి. ఇప్పటిదాకా నాలుగు వేల అప్పు అనే ఊబిలో పీకలదాకా కూరుకుని ఉన్నాను. రేపు మూడవ తారీఖు. అంటే, కాబూలీ వాడు తన మూడు వేల అప్పు వసూలు చేసుకోవడానికి వచ్చే రోజు. సాయంత్రం డాక్టర్ చెప్పాడు — తరుచుగా దగ్గే నాకు టి. బి. ట. వెంటనే శానటోరియమ్‌లో చేరాలట. తరవాత విచారించి లాభం లేదట. డబ్బుంటే చేరవచ్చు. కానీ, ఆ రెండక్షరాల మాటే నా జీవితంలో కరవయిపోయింది. ఇప్పుడు చెప్పు— నీది దుర్భర జీవితమా, నాదా?"

సుశీల నోటి వెంట మాట రావడం లేదు. ఆమె తల తిరిగిపోతూంది. భూమి మీద ఇంత నికృష్టపు జీవితాలు గడిపే వారు కూడా ఉన్నారా అని ఆమె ఆశ్చర్య పోతూంది.

"ఇన్ని కష్టాల్ని నేను భరిస్తున్నాను గాని, నీలా చావాలనుకోవటం లేదే! మనిషికి ఆత్మ ధైర్యం అవసరం. నా అజాగ్రత్త వల్ల నా జీవన శకటం పట్టాలు తప్పి కంకర దారిలో కూరుకుపోయింది. ఇక దానికి విముక్తి లేదు. కానీ, నీ జీవన శకటం ఇప్పుడే బయలుదేరింది. అప్పుడే నువ్వు అధైర్యపడిపోతున్నావు. నీ గమనాన్ని మార్చుకునే శక్తి నీలో ఉంది. నువ్వా నరకంలో మగ్గవలసిన అవసరం ఏముంది? నీకు టైపిస్టు ఉద్యోగమో, టీచరమ్మ ఉద్యోగమో దొరక్కపోదు. ఇక్కడ కాకపోతే నువ్వు మరో చోటకు వెళ్ళి నీ కాళ్ళమీద నువ్వు నిలబడు" అంటూ విపరీతంగా దగ్గి, మురికి కాలవలో ఉమ్మాడాయన. నల్లని మురికి మీద ఎర్రని రక్తం. కానీ, అది సుశీలకి కనబడలేదు.

సుశీల కళ్ళముందు చీకటి తెరలు విచ్చుకుంటున్నాయి. ఆలోచించి చూస్తే భవిష్యత్తు ఆమెకు అందంగానే కనిపిస్తూంది. "నా చీకటి జీవితంలో వెలుగు చిందించావు, బాబాయ్! అవును, నే నెందుకు చావాలి? చదువుకున్న నేను నా కాళ్ళమీద నిలబడతాను. బాబాయ్ ఫ్రెండ్ హైదరాబాదులో ఉన్నారు. అక్కడికి వెళ్ళి ఏదైనా ఉద్యోగం సంపాదించుకుంటాను. వెళతాను." చెవుల చుట్టూ కొంగు చుట్టుకొని వడివడిగా వెళ్ళిపోయింది సుశీల.

ఆయన మొహంలో ఎంతో తృప్తి. ఒకసారి ఇంటివాళ్ళందర్నీ చూసుకుని, తనకి ఈ నరకంలోనుంచి విముక్తిని ప్రసాదించే రైలు పట్టాం వైపు మళ్ళీ నడవసాగా డాయన.

దూరాన రైలు కూత వినిపించింది. ఆయన నడక వేగం హెచ్చించాడు.★